# ప్రకటన గ్రంథము 4వ అధ్యాయము

## పరలోక దర్శనము

ఈ సంగతులు జరిగిన తరువాత నేను చూడగా, అదిగో పరలోక మందు ఒక తలుపు
తెరువబడియుండెను. మరియు నేను మొదట వినిన స్వరము బూరధ్వని వలె నాతో మాటలాడగా వింటిని. ఆ
మాటలాడినవాడు– "ఇక్కడికి ఎక్కిరమ్ము ఇక మీదట జరుగవలసిన వాటిని నీకు కనుపరచెదను" అనెను. 2
వెంటనే నేను ఆత్మ వశుడనైతిని, అదిగో పరలోక మందు ఒక సింహాసనము వేయబడి యుండెను.
సింహాసనమునందు ఒకడు ఆసీనుడై యుండెను, 3 ఆసీనుడైనవాడు, దృష్టికి సూర్యకాంత పద్మరాగములను
పోలిన వాడు, మరకతమువలె ప్రకాశించు మేఘధనుస్సు సింహాసనమును ఆవరించియుండెను. 4
సింహాసనము చుట్టు ఇరువది నాలుగు సింహాసనములుండెను, ఈ సింహాసనములందు ఇరువది నలుగురు
పెద్దలు తెల్లని వస్త్రములు ధరించుకొని, తమ తలల మీద సువర్ణ కిరీటములు పెట్టుకొన్నవారై కూర్చుండిరి. 5
ఆ సింహాసనములో నుండి మెరుపులును ధ్వనులును ఉరుములును బయలు దేరుచున్నవి. మరియు ఆ
సింహాసనము ఎదుట ఏడు దీపములు ప్రజ్వలించుచున్నవి అవి దేవుని ఏడు ఆత్మలు. 6 మరియు ఆ
సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజువంటి సముద్రమున్నట్టుండెను. ఆ సింహాసనమునకు మధ్యను
సింహాసనము చుట్టును, ముందు వెనుక కన్నులతో నిండిన నాలుగు జీవులుండెను. 7 మొదటి జీవి సింహము
వంటిది రెండవ జీవి దూడవంటిది మూడవ జీవి మనుష్యుని ముఖము వంటి ముఖము గలది నాలుగవ
జీవి ఎగురుచున్న పక్షిరాజువంటిది. 8 ఈ నాలుగు జీవులలో ప్రతి జీవికి ఆరేసి రెక్కలుండెను, అవి చుట్టును
రెక్కల లోపటను కన్నులతో నిండియున్నవి. అవి–భూత వర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారియు
దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక రాత్రింబగళ్లు చెప్పు చుండును.

9 ఆ సింహాసనమునందు ఆసీనుడైయుండి యుగయుగములు జీవించుచున్న వానికి మహిమయు ఘనతయు
కృతజ్ఞతాస్తుతులును కలుగును గాకని ఆ జీవులు కీర్తించుచుండగా, 10 ఆ ఇరువది నలుగురు పెద్దలు
సింహాసనము నందు ఆసీనుడైయుండువాని యెదుట సాగిలపడి యుగయుగములు జీవించుచున్న వానికి
నమస్కారము చేయుచు– 11 ప్రభువా, మా దేవా, నీవు సమస్తమును సృష్టించితివి, నీ చిత్తమును బట్టి అవి
యుండెను దానిని బట్టియే సృష్టింపబడెను గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవని
చెప్పుచు తమ కిరీటములను ఆ సింహాసనము ఎదుట వేసిరి.